



# కరపత్రం

SINCE 2014

శుక్రవారం అక్టోబర్ 02, 2026 | సంపుటి : 2 | సంచిక : 354 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




## ప్రభుత్వ ఉద్యోగులకు రేవంత్ సర్కార్

# దసరా గిఫ్ట్..

- కేబినెట్ ఆమోదముద్ర
- ఉద్యోగుల డీఏ నిరీక్షణకు తెర
- 235 మండలాల్లో కరువు: అధికారులు
- కరువుపై కేబినెట్ సబ్‌కమిటీ
- కేంద్ర సాయం కోరాలని ప్రభుత్వ నిర్ణయం



ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రెండు డీఏలు చెల్లించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు గురువారం జరిగిన కేబినెట్ భేటీలో దీనికి ఆమోదముద్ర వేశారు. తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు ఎప్పటినుంచో డీఏల కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు ఎట్టకేలకు ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంది.
రేవంత్ సర్కార్ ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త అందించింది. రెండు డీఏలు చెల్లించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకున్నారు. ఎల్‌నినో పరిస్థితులపై తెలంగాణ కేబినెట్‌లో చర్చ జరిగింది. 235మండలాల్లో కరువు పరిస్థితులు ఉన్నాయని అధికారులు కేబినెట్‌కు వివరించారు. ఈ అంశంపై కేబినెట్ సబ్‌కమిటీలో చర్చించాలని మంత్రివర్గం నిర్ణయించింది. అలాగే కరువు పరిస్థితులపై త్వరలోనే అఖిలపక్షం ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. ఎల్‌నినో పరిస్థితులు, ఉపశమన చర్యలపై సలహాలు, సూచనలు స్వీకరించాలని కేబినెట్ నిర్ణయించింది. తెలంగాణలో కరువు మండలాల ప్రకటనతో పాటు, సాయం అందించాలంటూ కేంద్రాన్ని కోరాలని కూడా కేబినెట్ నిర్ణయానికి వచ్చింది. కేంద్రమంత్రులను కలిసి తెలంగాణలోని కరువు పరిస్థితిని వివరించాలని మంత్రులకు సీఎం రేవంత్ సూచించారు.
అటు హైదరాబాద్ సిటీ పోలీస్ పరిధిలో భారీ పునర్వ్యవస్థీకరణ జరిగింది. జోన్లు, డివిజన్లు, పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో తెలంగాణ ప్రభుత్వం కీలక మార్పులు చేసింది.

మిగతాద్ది 2 లో



## నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడి..

# వృద్ధుడికి జీవిత ఖైదు

హైదరాబాద్:
నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడి కేసులో వృద్ధుడికి జీవితఖైదు విధిస్తూ నాంపల్లి కోర్టు తీర్పు ఇచ్చింది. గోల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న జి.నారాయణ(76) అదే ప్రాంతంలోని చిన్నారి(4)పై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఫిర్యాదుతో 28 జూన్ 2025న గోల్కొండ పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి ఛార్జిషీట్ దాఖలు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదుతో పాటు రూ.25వేలు జరిమానా విధిస్తూ నాంపల్లి కోర్టు గురువారం తీర్పు వెలువరించింది. బాధితురాలికి రూ.2లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది.

# ఫారం-6 మార్పులపై రాహుల్ ప్రశ్నలు

- ఎవరి ఆదేశాలతో మార్పులు?
- TCS పై ఒత్తిడి తెచ్చారా?
- టీసీఎస్‌లో ఆమోదించింది ఎవరు?
- ఈసీ తీరుపై కాంగ్రెస్ నిరసనలు
- అదనపు డిక్లరేషన్‌పై వివాదం






# రేవంత్‌కు కేటీఆర్ సవాల్

- ఆస్తులపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణకు సిద్ధం
- తప్పని తేలితే శిక్షకు సిద్ధం
- సీఎం రేవంత్‌కు చిత్తశుద్ధి ఉండాలని డిమాండ్
- సిరిసిల్ల వ్యాఖ్యలపై కేటీఆర్ కౌంటర్

హైదరాబాద్:
సిరిసిల్లలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై భారత రాష్ట్ర సమితికార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాతల కాలం నుంచి మా ఆస్తులు, మీ ఆస్తులపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణకు సిద్ధమా? అని కేటీఆర్ సవాల్ విసిరారు. సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే విచారణకు రావాలని డిమాండ్ చేశారు. తమది తప్పని తేలితే ఏ శిక్షకైనా సిద్ధమేనని స్పష్టం చేశారు.
"నా బండారం బయటపెడతానని రేవంత్‌రెడ్డి నిన్న సిరిసిల్ల వెళ్లారు. శత్రుదేశంపై దండయాత్రకు వెళ్లినట్టు కాంగ్రెస్ నేతలు వెళ్లారు. అంతమంది పోలీసులు ఎందుకు.. అరెస్టులు ఎందుకు? నిన్న సీఎం సభలో పోలీసులు తప్ప ఎవరూ లేరు. మా తాతకు వందల ఎకరాలు ఉండేవి. కేసీఆర్ ఎమ్మెల్యే, ఎంపీ, మంత్రి, కేంద్రమంత్రి, డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు. అమెరికాలో ఆరేళ్లు ఉద్యోగం చేశాను.. ఎంతో కొంత సంపాదించా. ఆ డబ్బులతో 2006లో ఒక హోటల్ పెట్టాను. నాడు ఒక హోటల్ పెడితే.. ఇప్పుడు మూడు హోటళ్లు అయ్యాయి. నేను రాజకీయాల్లో లేకపోయుంటే.. పది హోటళ్లు చేసేవాడిని. నా హోటళ్లకు రేవంత్‌రెడ్డి నిన్న ఫ్రీ పబ్లిసిటీ ఇచ్చారు. అమెరికాలో ఎవరి పనులు వారే చేసుకుంటారు. బాత్‌రూమ్‌లు కడుక్కుంటే తప్పా? నేను అఫిడవిట్‌లో పెట్టిన సమాచారాన్నే.. నిన్న రేవంత్‌రెడ్డి చెప్పారు. మా నాన్న చదివించారు.. చదువుకున్నా.. రేవంత్‌రెడ్డికి చదువు రాలేదు. ఎవరైనా డిగ్రీ మూడేళు చదువుతారు.. రేవంత్‌రెడ్డి 8 ఏళ్లు చదివారు" అని కేటీఆర్ ఎద్దేవా చేశారు.




# ఖైరతాబాద్ ఉపఎన్నికపై పిటిషన్

» విజయారెడ్డి పిటిషన్‌పై హైకోర్టులో విచారణ
» ప్రతివాదులకు అఫిడవిట్ ఆదేశం
» దానం ఎన్నికపై 2024లో పిటిషన్
» తీర్పు వచ్చే వరకు నోటిఫికేషన్ ఆపాలని విజ్ఞప్తి
» విచారణ మంగళవారానికి వాయిదా




# ఈసీ కార్యాలయం తగలబడిపోతుంది: దానం

- 20 వేల ఓట్లు తొలగించారని ఆరోపణ
- ఈసీ అధికారులు బీజేపీతో కుమ్మక్కయ్యారని వ్యాఖ్య
- తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని డిమాండ్
- ఢిల్లీలో ఓట్ చోరీకి పాల్పడుతున్నారని ఆరోపణ

హైదరాబాద్:
"తన నియోజకవర్గంలో 20 వేల ఓట్లు తొలగించారని.. ఈసీ అధికారులు బీజేపీతో కుమ్మక్కై వారికి అనుబంధంగా పనిచేస్తున్నారంటూ మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.



# గచ్చిబౌలిలో వ్యభిచార ముఠా గుట్టురట్టు

హైదరాబాద్:
నగరంలోని గచ్చిబౌలి పీఎస్ పరిధిలో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠా గుట్టురట్టయింది. ఓ హోటల్ కేంద్రంగా విదేశీ యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.పక్కా సమాచారంతో హోటల్‌పై దాడి చేసి నిర్వాహకులు నిఖిల్, రామ్మోహన్‌రెడ్డి, విటుడు హర్షిత్ సింఘానియాతో పాటు ఉజ్బెకిస్థాన్‌కు చెందిన ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.13వేల నగదు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిర్వాహకుడు నిఖిల్‌ను ఢిల్లీకి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఉజ్బెకిస్థాన్ నుంచి వచ్చిన మహిళల పాస్‌పోర్టులు, వీసాలు చెల్లుబాటులో ఉన్నట్లు నిర్ధరించారు. కొద్దిరోజుల క్రితమే వారు హైదరాబాద్‌కు వచ్చినట్లు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




# బీఆర్ఎస్‌తో పొత్తు ఉండదు

- పొత్తుకు బీజేపీ సిద్ధంగా లేదు
- ఖైరతాబాద్‌లో బీజేపీ గెలుస్తుందని ధీమా
- కేసీఆర్ కుటుంబం ఐక్యంగా ఉంటే చాలు
- కాంగ్రెస్ ఫిరాయింపులను ప్రోత్సహిస్తోందని విమర్శ
- రేవంత్ వ్యాఖ్యలను కిషన్‌రెడ్డి ఖండించారు

న్యూఢిల్లీ:
తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీతో పొత్తుపై బీజేపీ సీనియర్ నాయకుడు, కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీతో బీజేపీ ఎటువంటి పొత్తు పెట్టుకోదని స్పష్టం చేశారు.

# సర్ ప్రక్రియ గడువు మళ్లీ పొడిగించే ఉద్దేశం లేదు: సుదర్శన్‌రెడ్డి

హైదరాబాద్:



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ లో భాగంగా 92 లక్షల మందికి నోటీసులు ఇచ్చామని రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. 65 లక్షల మంది నోటీసులకు సమాధానం ఇచ్చారని, 54 లక్షల మందిని తుది జాబితాలోకి తీసుకున్నామని వెల్లడించారు.
"ఖైరతాబాద్ నియోజకవర్గంలో 80వేల మందికి నోటీసులు ఇచ్చాం. నోటీసులు అందుకున్న వారిలో 20శాతం మంది సమాధానాలు ఇచ్చారు. నోటీసులు అందిన వారి ఇళ్ల వద్దకే బీఎల్‌వోలు వెళ్లి సంబంధిత పత్రాలు తీసుకుంటారు. నోటీసులు అందిన కుటుంబ సభ్యులు అందరూ ఉండాల్సిన పనిలేదు.. ఒక్కరే మిగిలిన కుటుంబ సభ్యుల వివరాలు ఇస్తే సరిపోతుంది. సర్ ప్రక్రియ గడువు మళ్లీ పొడిగించే ఉద్దేశం లేదు" అని సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

# తెలంగాణలో ప్రత్యేక TG TET నోటిఫికేషన్ జారీ




రాష్ట్రంలో ప్రత్యేక TG TET నోటిఫికేషన్ ను విద్యా శాఖ జారీ చేసింది. తెలంగాణ ఇన్ సర్వీస్ టీచర్ల కోసం రెండో విడత టెట్ నోటిఫికేషన్ విడుదల చేయడం గమనార్హం. తెలంగాణ ప్రభుత్వ, స్థానిక సంస్థలు, TGREIS, ప్రభుత్వ సంక్షేమ గురుకుల సొసైటీలు, తెలంగాణ మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న ఇన్ సర్వీస్ టీచర్లకు అవకాశం ఇవ్వనున్నట్లు తెలిపింది.ఇతర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కూడా పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చని.. నవంబర్ 16 నుంచి 21 వరకు ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష జరుగుతుందని ప్రభుత్వం పేర్కొంది. అక్టోబర్ 7 నుంచి 16 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని ప్రకటించిన తెలంగాణ పాఠశాల విద్యా శాఖ, schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉంచింది.

# ఎల్‌నినో ప్రభావం..

## ఈ ఏడాది చలి తీవ్రత తక్కువే: వాతావరణశాఖ

హైదరాబాద్:
శీతాకాలం ఔట్ లుక్‌ను భారత వాతావరణ శాఖ విడుదల చేసింది. వర్షాకాలం ముగిసి నేటి నుంచి శీతాకాలం ప్రారంభమైనట్లు తెలిపింది.



కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం అక్టోబర్ 02, 2026

# ఫారం-6లో మార్పులు ఎవరి ఆదేశాలతో జరిగాయో చెప్పండి: రాహుల్

మొదటిపేజీ తరువాయి
ఓటరు నమోదుకు ఉపయోగించే ఆన్‌లైన్ ఫారం-6లో మార్పులు ఎవరి ఆదేశాలతో జరిగాయో బయటపెట్టాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు. "టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ తో ఈ మార్పులు చేయించింది ఎవరు? టీసీఎస్‌లో దీనికి ఆమోదం తెలిపింది ఎవరు? ఆ సంస్థపై ఏమైనా ఒత్తిడి తెచ్చారా?" అని ఆయన ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.
ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో నూతన నిబంధనలపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు ఎస్ఎస్ సంధూ, వివేక్ జోషి అభ్యంతరం తెలిపినట్లు వార్తలు రావడంతో దీనిపై వివాదం తలెత్తిన విషయం తెలిసిందే. దీంతో సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా పలుచోట్ల నిరసనలు చేపట్టింది. ఈ నేపథ్యంలోనే ఈసీ పనితీరును ప్రశ్నిస్తూ రాహుల్ గాంధీ వరుసగా పోస్ట్‌లు చేస్తున్నారు.

**మేధావులు, విద్యావేత్తలపై మోదీ అక్కసు: రాహుల్**
సర్ ప్రక్రియలో భాగంగా.. కొత్తగా దరఖాస్తు చేసుకోవాలనుకునే ఓటర్లు తండ్రి, తాతల పేర్లను వెల్లడించాలని పేర్కొంటూ ఎన్నికల సంఘం ఫారం-6కు అదనంగా డిక్లరేషన్‌ను జోడించడంతో వివాదం తలెత్తింది. ఆన్‌లైన్ పోర్టల్‌లో ఈ వివరాలు నమోదు చేయకపోతే దరఖాస్తు ముందుకు సాగట్లేదని చాలా మంది ఫిర్యాదులు చేశారు. దీని వల్ల తాము ఓటుకు దూరమయ్యే పరిస్థితి వచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు, సర్ ప్రక్రియ పూర్తయిన రాష్ట్రాల్లో ఈ అదనపు డిక్లరేషన్ నిబంధనను సెప్టెంబరు 30 నుంచి ఈసీ (జుశ్రీవషిఅశీఅ జశీఎఎఱంంఱశీఅ) తొలగించింది. అయితే ప్రస్తుతం సర్ ప్రక్రియ కొనసాగుతున్న రాష్ట్రాల్లో మాత్రం అది యథావిధిగా ఉండటం గమనార్హం.

# బీఆర్ఎస్‌తో పొత్తు ఉండదు

మొదటిపేజీ తరువాయి
బీఆర్ఎస్ పార్టీ ముందుకు వచ్చినా తాము సిద్ధంగా లేమని చెప్పారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో తమ పార్టీ విజయం సాధిస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

"తెలంగాణలో బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తు ఉండదు. బీఆర్ఎస్‌తో పొత్తు ఉంటుందని ఎవరు అంటున్నారు? బీఆర్ఎస్‌తో పొత్తు ఎవరు కోరుకోవడం లేదు. మొదట కేటీఆర్ ఆయన చెల్లెలు కవితతో కలిసి ఉండాలి. కేసీఆర్ కుటుంబమంతా ఐక్యంగా ఉంటే చాలు. మేము వాళ్లతో కలవాల్సిన అవసరం లేదు. ఖైరతాబాద్‌లో లాస్ట్ టైం పొరపాటున ఓడిపోయాం. ఈసారి వందకు వంద శాతం సీటు నిలబెట్టుకుంటాం. బీజేపీని గెలిపించాలని ఖైరతాబాద్ ప్రజలు ఇప్పటికే మెంటల్‌గా ప్రిపేరైపోయారు. కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి ప్రజల తీర్పును కాలరాసింద"ని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

**రేవంత్.. సోనియా బానిస**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కిషన్‌రెడ్డి విమర్శలు చేశారు. తెలంగాణ ప్రజల ఆశీస్సులతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి.. సోనియా గాంధీ కుటుంబానికి బానిసగా ఉంటానని చెప్పడాన్ని ఆక్షేపించారు. 'రేవంత్.. ఢిల్లీలో సోనియా కుటుంబానికి బానిస. హైదరాబాద్‌లో మజ్లిస్ కుటుంబానికి బానిస' అని వ్యాఖ్యానించారు. మహిళల రిజర్వేషన్లు, పార్లమెంట్ సీట్ల పెంపు విషయంలో రేవంత్‌రెడ్డి అబద్దాలు చెబుతున్నారని ధ్వజమెత్తారు. సీట్ల పెంపు విషయంలో అబద్దాలతో విషం చిమ్ముతూ, ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉండి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు.

**రేవంత్ వ్యాఖ్యలను ఖండిస్తున్నా**
రేవంత్‌రెడ్డి తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి సనాతన ధర్మం, రాజ్యాంగబద్ధ సంస్థలపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా.. మతం, దేవుడి పేరుతో ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రోజుకే కొత్త అంశాన్ని తెర మీదకు తెచ్చి నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. ప్రజలను అన్ని రకాలుగా విభజించే అలవాటు కాంగ్రెస్ పార్టీకి ఎప్పటి నుంచో ఉందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు రేవంత్ సర్కార్ దసరా గిఫ్ట్..

మొదటిపేజీ తరువాయి
మొత్తం 76 ప్రాంతాలకు సంబంధించి పోలీస్ పరిధులను పునర్విభజిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పునర్వ్యవస్థీకరణలో భాగంగా కొన్ని పోలీస్‌స్టేషన్ల పరిధులను ఇతర జోన్లు, డివిజన్లకు బదిలీ చేశారు. మార్కెట్ పీఎస్ పరిధిలోని పలు ప్రాంతాలను మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోకి మార్చారు. మహేశ్వరం, శంషాబాద్, సైబరాబాద్ పరిధుల్లోనూ పోలీస్‌స్టేషన్ల పరిధులను పునర్విభజించారు. శంషాబాద్ డివిజన్‌లోనూ కీలక మార్పులు చేశారు. ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పేరును శంషాబాద్ పోలీస్‌స్టేషన్‌గా మార్చారు. ఆర్‌జీఐఏ, శంషాబాద్ పోలీస్‌స్టేషన్ల పరిధులను కూడా పునర్వ్యవస్థీకరించారు. రాజేంద్రనగర్ పీఎస్ పరిధిలోని పలు ప్రాంతాల్లోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. అబ్దుల్లాపూర్‌మెట్, మీర్‌పేట్ ప్రాంతాల్లో పోలీస్ పరిధులను మార్చారు.
మరోవైపు.. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, సనత్‌నగర్ ప్రాంతాల్లోనూ పరిధుల పునర్విభజన జరిగింది. ప్రాంతాల వారీగా పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ మార్పులు చేసినట్టు తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. కేవలం లా అండ్ ఆర్డర్ పరిధులకే పరిమితం కాకుండా.. ట్రాఫిక్ పోలీస్ పరిధిలోనూ పునర్వ్యవస్థీకరణ చేపట్టారు. జోన్లు, డివిజన్లలో మార్పులు చేశారు. వుమెన్ సేఫ్టీ వింగ్‌కు కొత్తగా జోన్లను కేటాయించారు. జోనల్ సైబర్ సెల్ పరిధులను కూడా పునర్వ్యవస్థీకరించారు. మొత్తంగా.. హైదరాబాద్ సిటీ పోలీస్ పరిధిలో 76 ప్రాంతాలకు సంబంధించి మార్పులు జరిగాయి. వివిధ పోలీస్‌స్టేషన్లు, జోన్లు, డివిజన్ల పరిధులను పునర్విభజిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# చెక్‌పవర్ విషయంలో సర్కార్ ఆదేశాలు..
## ఉపసర్పంచ్ సంతకం చేయకపోతే EO, MPDO చేయొచ్చు..!

గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, ఉప సర్పంచ్‌ల మధ్య విభేదాల కారణంగా చెక్కులపై సంతకాలు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క ఆదేశించారు. తగిన కారణం లేకుండా ఉప సర్పంచ్ 7 రోజులకు మించి చెక్కులపై సంతకం చేయకుండా జాప్యం చేస్తే జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టనున్నారు. ఉద్దేశపూర్వకంగా చెల్లింపులను అడ్డుకున్నట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. అవసరమైతే ఉప సర్పంచ్ స్థానంలో పంచాయతీ కార్యదర్శి, ఎంపీఓ లేదా ఎంపీడీవోలో ఒకరికి జాయింట్ చెక్ పవర్ ఇచ్చేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించింది.
ఖజూఖ ఘుతీజూఖఅష్ట్ర జస్త్రవనబవ్రాశీషవతీ
గ్రామ పంచాయతీల్లో చెక్ పవర్‌పై మంత్రి సీతక్క ఆదేశాలు(ఫోటోలు- ఘుఖ్ఖుఖుఎ ఎవశ్రీబస్త్రబ)
తెలంగాణలోని గ్రామ పంచాయతీల్లో చెక్ పవర్ విషయంలో జరుగుతున్న ఘర్షణకు చెక్ పెట్టేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామాల్లో అభివృద్ధి పనుల బిల్లుల చెల్లింపుల విషయంలో ఎదురవుతున్న జాప్యానికి చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. సర్పంచ్, ఉప సర్పంచ్‌ల మధ్య విభేదాల కారణంగా చెక్కులపై సంతకాలు ఆలస్యం కావడం.. ఇలా జరగడం వల్ల అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో పడుతున్న పరిస్థితిని నివారించేందుకు కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది. పంచాయతీల్లో చెక్కుల చెల్లింపులు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులకు (డీపీఓ) ప్రభుత్వం స్పష్టమైన సూచనలు చేసింది.




కొత్త ఆదేశాల ప్రకారం.. గ్రామ పంచాయతీల్లో బిల్లుల చెల్లింపులకు సంబంధించిన చెక్కులపై ఉప సర్పంచ్ సంతకం చేయాల్సి ఉంటే.. కారణం లేకుండా వాటిని పెండింగ్‌లో పెట్టకూడదని తెలిపింది. తగిన కారణం లేకుండా ఏడు రోజులకు మించి సంతకం చేయకుండా జాప్యం చేస్తే సంబంధిత జిల్లా కలెక్టర్ దానిపై విచారణ చేపట్టాల్సి ఉంటుంది. విచారణలో ఉప సర్పంచ్ ఉద్దేశపూర్వకంగానే చెక్కులపై సంతకం చేయకుండా బిల్లుల చెల్లింపులను అడ్డుకున్నట్లు తేలితే.. నిబంధనల ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. దీంతో కేవలం వ్యక్తిగత విభేదాలు, ఇతర కారణాలతో పంచాయతీ నిధుల చెల్లింపులు నిలిచిపోకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

చెక్కులపై సంతకం విషయంలో అనవసర జాప్యం కొనసాగి.. పంచాయతీ అభివృద్ధి పనులు, బిల్లుల చెల్లింపులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడితే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఇలాంటి సందర్భాల్లో ఉప సర్పంచ్‌కు ఉన్న జాయింట్ చెక్ పవర్‌ను తొలగించి.. ఆయన స్థానంలో అధికారుల్లో ఒకరికి జాయింట్ చెక్ పవర్ కల్పించేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

పంచాయతీ కార్యదర్శి, ఎంపీఓ లేదా ఎంపీడీవోలో ఒకరికి ఉప సర్పంచ్ స్థానంలో జాయింట్ చెక్ పవర్ ఇచ్చే అవకాశం ఉంటుంది. తద్వారా చెక్కుల చెల్లింపులు ఆగిపోకుండా పంచాయతీ నిధుల వినియోగం కొనసాగించేందుకు వీలు కలుగుతుంది. గ్రామ పంచాయతీల్లో రోడ్లు, డ్రైనేజీలు, పారిశుద్ధ్యం, తాగునీరు వంటి అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులు సకాలంలో జరగడం కీలకం. అయితే కొన్ని చోట్ల సర్పంచ్, ఉప సర్పంచ్‌ల మధ్య తలెత్తుతున్న విభేదాలు చెక్కులపై సంతకాల విషయంలో సమస్యలకు దారితీస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది.

ఈ నేపథ్యంలోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం తాజా మార్గదర్శకాలను తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. ఒకవైపు ఉప సర్పంచ్‌కు తన అభ్యంతరాలను తెలియజేసే అవకాశం ఉండేలా.. మరోవైపు కారణం లేకుండా సంతకాలు నిలిపివేసి పంచాయతీ కార్యకలాపాలను స్తంభింపజేయకుండా చర్యలు తీసుకునేలా నిబంధనలను స్పష్టం చేశారు. తాజా ఆదేశాలతో ఇకపై చెక్కులపై సంతకాల విషయంలో తలెత్తే వివాదాలను జిల్లా కలెక్టర్లు పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఏడు రోజులకు మించి కారణం లేకుండా చెక్కులు పెండింగ్‌లో ఉంటే విచారణ చేపట్టి.. ఉద్దేశపూర్వక జాప్యం జరిగిందా లేదా అన్నది తేల్చాల్సి ఉంటుంది.

విచారణ తర్వాత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు.. అవసరమైన సందర్భాల్లో ప్రత్యామ్నాయ అధికారికి జాయింట్ చెక్ పవర్ అప్పగించేలా చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో గ్రామ పంచాయతీల్లో బిల్లుల చెల్లింపుల ప్రక్రియ వేగవంతం కావడంతో పాటు.. చెక్ పవర్ విషయంలో తలెత్తుతున్న వివాదాలకు పరిష్కారం లభించే అవకాశం ఉంది.

# క్రెడిట్‌కార్డు ఛార్జీలు తగ్గిస్తామని.. రూ.3.50 లక్షల స్వాహా

ఇప్పటి వరకు బ్యాంక్ ఖాతాలు, ఏటీఎం కార్డుల నుంచి డబ్బులు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు.. ఇప్పుడు క్రెడిట్ కార్డుదారులను లక్ష్యంగా చేసుకొని రూ.లక్షలు కాజేస్తున్నారు. ఇలాంటి ఘటనే డిచ్‌పల్లి మండలం ధర్మారం (బి) గ్రామంలో జరిగింది. క్రెడిట్ కార్డుకు వార్షిక ఫీజు 3,500 ఉంటుందని, వివరాలు అప్‌డేట్ చేస్తే ఫీజు తగ్గిస్తామని చెప్పి.. దాదాపు రూ. 3.50 లక్షలు కాజేశారు. గత నెల 22న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.స్థానికంగా కార్ల



కొనుగోలు, అమ్మకాల వ్యాపారం చేసే ఓంకార్.. ఐదారు క్రెడిట్ కార్డులను వినియోగిస్తుంటారు. 15 రోజుల క్రితం ప్రైవేటు బ్యాంక్ నుంచి కొత్తగా క్రెడిట్ కార్డు ఇస్తామని ఫోన్ రావడంతో బాధితుడు వివరాలు ఇచ్చారు. క్రెడిట్ కార్డు కుడా వచ్చింది. వారం తర్వాత మీరు క్రెడిట్ కార్డు కొత్తది తీసుకున్నారు కదా.. వార్షిక ఫీజు రూ. 3,500 చెల్లించాల్సి ఉంటుందని సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి చెప్పారు. ఛార్జీలు తగ్గాలంటే ఒక యాక్ ఇన్‌స్టాల్ చేసుకొని వివరాలు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. వాట్సప్ నెంబర్‌కు లింక్ పంపించి ఓపెన్ చేయాలని సూచించారు. లింక్ ఓపెన్ చేయగానే ఏపీకే ఫైల్ ఇన్‌స్టాల్ అవడంతో క్షణాల్లో ఫోన్ మొత్తం హ్యాకర్ల చేతుల్లోకి వెళ్లింది. నిమిషాల వ్యవధిలో దాదాపు 4 క్రెడిట్ కార్డుల నుంచి ఆన్‌లైన్ షాపింగ్ చేస్తున్నట్లు ఓటీపీలు రావడం, అన్ని క్రెడిట్ కార్డుల నుంచి రూ. 3.50 లక్షలు కట్ కావడం జరిగిపోయాయి. మోసపోయినట్లు తెలుసుకున్న బాధితుడు.. పోలీసులను ఆశ్రయించాడు.

# ఖైరతాబాద్ ఉపఎన్నికపై విజయారెడ్డి పిటిషన్.. విచారణ వాయిదా

మొదటిపేజీ తరువాయి
ఖైరతాబాద్ ఉప ఎన్నిక అంశంలో మాజీ మంత్రి పీజేఆర్ కుమార్తె విజయారెడ్డి దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు లో విచారణ జరిగింది. అఫిడవిట్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది. ఖైరతాబాద్ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వకుండా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలంటూ విజయారెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. దానం నాగేందర్ ఎన్నికపై 2024లో పిటిషన్ వేశామని కోర్టుకు తెలిపారు. అఫిడవిట్‌లో దానం తప్పుడు సమాచారం ఇచ్చారని.. ఆ పిటిషన్ ప్రస్తుతం విచారణ దశలో ఉందని విజయారెడ్డి తరఫు న్యాయవాది చెప్పారు. గతంలో వేసిన పిటిషన్‌పై తీర్పు వచ్చే వరకు ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వకుండా ఆదేశించాలని విజయారెడ్డి కోరారు.

# ఈసీ కార్యాలయం తగలబడిపోతుంది: దానం

మొదటిపేజీ తరువాయి
గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో మాత్రం మామూలుగా ఉండదు. ఎన్నికల కమిషనర్ కార్యాలయం తగలబడిపోతుంది" ఆయన అంటూ వ్యాఖ్యానించారు.

ఢిల్లీ కేంద్రంగా బీజేపీ నేతలు వ్యవస్థీకృతమైన ఓట్ చోరీకి పాల్పడుతున్నారని.. ఈసీ తక్షణమే స్పందించి, తొలగించిన ఓట్లను యథావిధిగా పునరుద్ధరించాలని దానం డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా.. ఖైరతాబాద్ ఉప ఎన్నిక నోటిఫికేషన్ జారీ చేయకుండా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకురాలు, పీజేఆర్ కుమార్తె విజయారెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. అయితే ఈ పిటిషన్‌పై అత్యవసర విచారణ జరపాలంటూ ఆమె దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. దీంతో, పిటిషన్ తదుపరి విచారణ ఎప్పుడు జరుగుతుంది? అనేది ఆసక్తికరంగా మారింది.

# ఎల్‌నినో ప్రభావం..
## ఈ ఏడాది చలి తీవ్రత తక్కువే: వాతావరణశాఖ

మొదటిపేజీ తరువాయి
ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది చలి తీవ్రత తక్కువగానే ఉంటుందని పేర్కొంది. అక్టోబర్‌లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశముందని వాతావరణశాఖ తెలిపింది. అక్టోబర్ నుంచి డిసెంబర్ సీజన్‌లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశముందని పేర్కొంది. దేశవ్యాప్తంగా అక్టోబర్‌లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా ఉండే వీలుందని తెలిపింది. తెలంగాణలో ఈ సీజన్‌లో 18 శాతం లోటు వర్షపాతం ఉందని వాతావరణశాఖ వెల్లడించింది. అత్యధిక లోటు వర్షపాతం జాబితాలో నల్గొండ, నిర్మల్, జోగులాంబ గద్వాల, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలు ఉన్నట్లు పేర్కొంది.

# హైదరాబాద్ వాసులకు భారీ శుభవార్త.. ఆర్టీసీ, మెట్రో సర్వీసులకు కామన్ పాస్.. ఒక్కసారి కొంటే..



హైదరాబాద్ ప్రజలకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. నగరంలోని బస్సులు, మెట్రోలో ప్రయాణం మరింత సులభతరం కానుంది. బస్సులు, మెట్రోలలో ప్రయాణించాలంటే ప్రతీసారి టికెట్ తీసుకోవాల్సిన అవసరం ఉండదు. ఒకే పాస్‌తో ఆర్టీసీ బస్సులతో పాటు మెట్రోలలో కూడా ప్రయాణం చేయవచ్చు. మెట్రోలలో ఫిజికల్ టికెట్ తీసుకోవాలంటే కౌంటర్ల వద్ద క్యూలైన్లలో నిల్చోవాల్సి ఉంటుంది. దీని వల్ల సమయం వృథా అవుతుంది. ఆర్టీసీ బస్సుల్లో టికెట్ తీసుకోవాలన్నా రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు చాలా సమయం పడుతుంది. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు రేవంత్ సర్కార్ కామన్ పాస్‌ను తీసుకొచ్చింది. దీని వల్ల పదే పదే టికెట్ తీసుకోవాల్సిన పని లేకపోవడం వల్ల వేగవంతమైన ప్రయాణం చేయవచ్చు.

**మెట్రో, ఆర్టీసీ సేవలకు ఉమ్మడి పాస్**
ఆర్టీసీ, మెట్రో సర్వీసుల కోసం కామన్ పాస్‌ను అక్టోబర్ 2వ తేదీన తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించనుంది. ప్రజాభవన్‌లో జరగనున్న కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దీనిని లాంచ్ చేయనున్నారు. ఇందులో భాగంగా రోజువారీ, వారం రోజులు, నెలవారీ పాస్‌లను ప్రవేశపెడతారు. రోజువారీ పాస్ ధర రూ. 400గా ఉండనుండగా.. నెలవారీ పాస్ ధర రూ. 8500గా నిర్ణయించారు. పాస్‌తో మెట్రో, ఆర్టీసీ బస్సులు రెండింటిల్లోనూ నగర పరిధిలో ఎక్కడినుంచి ఎక్కడికైనా ప్రయాణం చేయవచ్చన్నమాట. రోజూ ప్రతీ బస్సులో, మెట్రోలో టికెట్ తీసుకోవాల్సిన పని తప్పుతుంది. తెలంగాణ ప్రభుత్వం, టీజీఎస్‌ఆర్టీసీ, హైదరాబాద్ మెట్రో రైల్ సంయుక్తంగా ఈ కామన్ పాస్‌ను తీసుకొస్తున్నాయి. రేపటి నుంచే ఈ పాస్‌లను ప్రజలు కొనుగోలు చేయవచ్చు. ఈ పాస్ హైదరాబాద్ పరిధిలో తిరిగే ఆర్డినరీ, మెట్రో లగ్జరీ, ఎలక్ట్రిక్, ఏసీ బస్సుల్లో వర్తిస్తుంది. ఇక మెట్రోలలో కూడా వర్తిస్తుంది. ఔటర్ రింగ్ రోడ్ పరిధి వరకు ఈ పాస్‌లు చెల్లుబాటు అవుతాయి. దీంతో శివారు ప్రాంతాల ప్రజలకు కూడా ఉపయోగపడనుంది.

**యాప్‌లోనే ఆర్టీసీ టికెట్ బుకింగ్..**
ఆర్టీసీ టికెట్ బుకింగ్ మరింత సులువు కానుంది. యాప్‌లో టికెట్ పొందే విధానం తీసుకొస్తుంది. రోజువారీ టికెట్‌తో పాటు డే, వీక్లీ, నెలవారీ పాస్‌లను యాప్ ద్వారానే పొందవచ్చు. దీని ఫిజికల్ టికెట్ అవసరం ఉండదు. అక్టోబర్ 2న ఈ కొత్త సిస్టమ్‌ను టీజీఎస్‌ఆర్టీసీ ప్రారంభించనుంది. ఇప్పటివరకు పాస్ తీసుకోవాలంటే ఆర్టీసీ కౌంటర్లకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పటినుంచి ఆ బాధ తప్పుతుంది. సులువుగా మొబైల్ యాప్ ద్వారానే ఆర్టీసీ పాస్‌లు పొందవచ్చు. ఇక ఉమ్మడి పాస్ వల్ల టికెట్ కష్టాలు తొలగిపోనున్నాయి.

# బీచ్‌లో విషాదం.. ఎనిమిది మంది విద్యార్థుల మృతి



మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విహారయాత్రలో భాగంగా బీచ్‌కు వెళ్లిన విద్యార్థుల్లో ఎనిమిది మంది నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పుణె జిల్లాలోని ఓ ప్రైవేట్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన విద్యార్థులు, సిబ్బంది రాయ్‌గఢ్ జిల్లాలోని దివేఅగర్ బీచ్‌కు పిక్నిక్‌కు వెళ్లారు. వీరిలో 25 మంది బాలురు, 17 మంది బాలికలు, ఆరుగురు ఉపాధ్యాయులు సహా మొత్తం 48 మంది ఉన్నారు. ఈ క్రమంలోనే సముద్రంలో దిగిన ఎనిమిది మంది విద్యార్థులు నీటి లోతు, ప్రవాహాన్ని అంచనా వేయలేక కొట్టుకుపోయారు. సమాచారం అందిన వెంటనే రంగంలోకి దిగిన సహాయక బృందాలు.. ఎనిమిది మంది మృతదేహాలను వెలికితీశాయని పోలీసులు తెలిపారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
శుక్రవారం అక్టోబర్ 02, 2026

# మనిషి పలికే తొలి శబ్దం అమ్మ

# ఆది స్వరం అమ్మ.. ఓంకారం అమ్మ

**శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్**

కొన్ని నెలల క్రితం మా ఇంటిలో కొత్తగా ఒక పనిమనిషి చేరింది. ఆమె విషయంలో పని మనిషి అన్న పదం కరెక్ట్ కాదేమో!.

ఆమె పనిలో చేరిన మూడు నాలుగు రోజుల తరువాత అడిగా.. అమ్మా! ఎక్కడ మీ ఇల్లు, ఎంత మంది పిల్లలు అని.
ముగ్గురు అమ్మాయిలు అండి అని అన్నది.

పెళ్లిళ్లు అయ్యాయా?
లేదండి ఇంకా చదువుకుంటున్నారు.

ఓకే... ఏం చదువు కుంటున్నారు అని క్యాజువల్ గా అడిగా..
పెద్ద అమ్మాయి ఎం.ఎస్సి. ఆర్గానిక్ కెమిస్ట్రీ చేసి డిగ్రీ కాలేజ్ లో కాంట్రాక్ట్ లెక్చరర్ గా చేస్తోంది అని చెప్పింది.
నేను ఆ... అంటూ నోరు తెరిచా

రెండో అమ్మాయి?
ఎం.ఎస్సి మొదటి సంవత్సరం అండి.
మూడో అమ్మాయి?
వైద్య విద్యలో రెండో సంవత్సరం అని చెప్పింది.

ఆ.. అని నోరు వెళ్ల బెట్టా.
నర్సింగ్ కోర్సా అన్నా...

కాదు సార్ ఎం.బి.బి.ఎస్ అంది.

నాకు అర్థం కావటం లేదు. ఈవిడ ఏమంటోంది? ఏం మాట్లాడుతోంది?.. ఈవిడకు ఏం మాట్లాడుతోందో అర్థం అవుతోందా?

మళ్ళీ మళ్ళీ అడిగా, అవే సమాధానాలు

ఎం.బి.బి.ఎస్ ఫ్రీ సీటా? అని అడిగా .. అవును సార్, ఫ్రీ సీటే అంది.

అదేదో బిల్డింగ్ ఫీజ్ అంటా, దానికే తంటాలు పడుతున్నా కట్టడానికి అని మెల్లిగా చెప్పింది.

ఏ స్కూలులో చదువుకున్నారు అమ్మా మీ పిల్లలు?.. అని అడిగా.

ఇక్కడే, మన ఊరి బడి లొనే 10 వ తరగతి వరకు అని అంది.

అమ్మాయి ఎంబిబిఎస్ లాంగ్ టర్మ్ గట్రా వెళ్లిందా? అని అడిగా.

- **ఏం లేదయ్యా, మన ఊరి కాలేజ్ యే, నాకు ఈ చదువుల గోల ఏం తెలీదయ్యా. ఇప్పుడు ఇప్పుడే కాస్త నోరు తిరుగుతోంది అని చెప్పింది.**

ఏం చదువుకున్నావు అమ్మా నువ్వు అని అడిగా. రెండులో మానేశానయ్యా అని అన్నది.

మరి పిల్లలకు మార్గదర్శనం నువ్వే చేసావా?.. అన్నాను.

నాకు కూడికలు, తీసి వేతలు కూడా రావు. చాలా కష్టాలు పడ్డాను పిల్లలను చదివించడానికి అని అన్నది.

- **మీ ఆయన ఏం చేస్తాడు?.. అని అడిగా.**

ఆయనా అందరి లాగే, ఇంటి విషయాలు ఏం పట్టవు తనకి అని చెప్పింది.

- **ఆయన త్రాగుతాడు. 100 రూపాయలు సంపాదిస్తే 10 రూపాయలు ఇంట్లో ఇవ్వడం కూడా గగనం. ఇప్పుడు ఇప్పుడు కొంచం మారుతున్నడు, పాప డాక్టర్ కోర్స్ లో చేరిన తరువాత అని అంది.**

మా పెద్ద అమ్మాయిని ఏడో తరగతిలో చదువు మానిపించేసా .. కానీ వాళ్ల టీచర్ ఇంటికి వచ్చి, నన్ను మందలించి, మంచి తెలివి గల అమ్మాయి, చక్కగా చదువు కొంటోంది అని చెప్పి బడికి తీసుకొని వెళ్ళింది.

- **అప్పటికి అర్థం అయ్యింది నాకు, నా పిల్లలు తెలివి గల వాళ్ళు అని, నా పిల్లల చదువులు ఆగ కూడదు అని ఇంకో రెండు ఇల్లులు ఎక్కువ ఒప్పుకోవటం మొదలు పెట్టా అని చెబుతున్నది.**

ఇంట్లో సరిగ్గా కరెంట్ కూడా ఉండేది కాదు. మూడు మూడు నెలలు బిల్ కట్టలేక పోయే దాన్ని, పిల్లలు ఆలాగే బుడ్డి దీపాల్లో




చదువుకున్నారు.

ఇప్పుడు కాస్త పర్వాలేదు, పెద్ద అమ్మాయి కాస్త సంపాదిస్తోంది. ఎలాగో కిందా మీదా పడుతున్నాను అంది.

నాకు నోట మాట రాలేదు. ఒక చదువుకోని మహిళ,భర్త త్రాగుబోతు, ఇంతగా కష్టపడి పిల్లలను ఇంతగా వృద్ధిలోకి తెచ్చిందా?..

లక్షలు, లక్షలు ఫీజులు పోస్తుంటే నాపిల్లలు అస్సలు చదవట్లేదు. నా పిల్లలు వీళ్ళలో సగం చదువుకున్నా చాలు అనుకున్నా.

- **అంతే, నాకు అర్జంట్ గా వీళ్ళ ముగ్గురు పిల్లలని కలవాలి అనిపించింది. నేను మీ ముగ్గురు అమ్మాయిలతో మాట్లాడాలి, నాకు పరిచయం చేయ్యాలి అని అడిగా. అలా మీ పిల్లలను చూపించినట్లు ఉంటుంది అన్నా.**

నేను ఆడిగినట్లే, ముగ్గురిని తీసుకొని సాయంత్రం ఇంటికి వచ్చింది.

- **ముగ్గురు వాళ్ళ అమ్మతో పాటు నేలపై కూర్చున్నారు. నా మనస్సు చివుక్కుమంది. ఎంతగానో బ్రతిమాలితే గాని, కుర్చీలపై కూర్చో లేదు.**

- **నేల పైనే. నాకు అలవాటే సారూ అని అంది.**

నా పిల్లలు నాలా మిగిలి పోకూడదు అనే ఈ నా శ్రమ అంతా. మీలాంటి గొప్ప వాళ్ళతో పాటు సరి సమానంగా కూర్చున్నారు చూడండి, ఇది చాలు, అంది కళ్ళ నీళ్లతో..

- **నేను కాదు, వీళ్లు కాదు. నువ్వు, నువ్వు గొప్ప దానివి అమ్మా అన్నాను.**

మొదటి పది నిమిషాలు పిల్లలు ముగ్గురు ముడుచుకు కూర్చున్నారు, తరువాత కొంచం కొంచం మాట్లాడ్డం మొదలు పెట్టారు.

- **తాము పడిన కష్టాలు, పడుతున్న కష్టాలు, ఎలా సీట్లు తెచ్చుకొంది, ఎంతో కొంత స్కాలర్షిప్ లు రావటం, అవి వారికి సహాయ పడడం గురించి చెప్పారు. నిజంగా ఇలాంటి వారే పథకాలకు అర్హులు అనిపించింది.**

వీళ్లకు ఏదన్నా సహాయం చేద్దాం అని గట్టిగా మనసులో అనుకున్నా. నా నుండి మీకు ఏం కావాలి అని అడిగా?

॥ఎంత అనుకువగా ఉన్నారో.. అంత ఆత్మవిశ్వాసం, ఆత్మాభిమానం మెండుగా ఉన్నాయి వారికి. ఏమి అడిగినా ఆహా వద్దు అనే సమాధానం.॥

నేను, నా అర్ధాంగి అడగంగా, అడగంగా, ఒక టూ వీలర్ ఇప్పించండి, ముగ్గురం కలిసి ఊయోగించు కుంటాం, మీకు నెల నెలా ఇస్తాం, మేము లోన్ లో తీసుకోలేము, అనవసరమైన వడ్డీ అన్నారు.

టూ వీలర్ ఉంటే, కాస్త సౌలభ్యశీగా ఉంటుంది, సగం డబ్బులు ఆటోలకు అయి పోతున్నాయి, మా ఏరియా దగ్గర షేర్ ఆటోలు దొరకవు, దొరికే స్టాప్ వరకు నడచి అలిసిపోవటం, సమయం కూడా వ్యర్థం అవుతున్నాయి. టూ వీలర్ ఉంటే అలిసిపోము, మిగిలిన సమయాన్ని చదువు కునేందుకు ఉపయోగించు కుంటాము అన్నారు.

- **టూ వీలర్ ఇప్పించాను.ఒక తొమ్మిది నెలల్లో నాకు ఒక పైసా వదలకుండా మొత్తం తీర్చేశారు. ఒక పది వేలు ఉంచుకోండి అని అన్నా వినకుండా ఇచ్చేశారు.**

పెద్ద అమ్మాయి ఇద్దరిని డ్రాప్ చేసిన తరువాత తన కాలేజ్ కు వెళ్లి పోతుంది. మళ్ళీ ఇద్దరని పికప్ చేసుకుని ఇంటికి వస్తుంది.

పెద్ద అమ్మాయి జూనియర్ లెక్చరర్ పోస్టు కు సన్నద్ధం అవుతోంది. రెండో అమ్మాయి సాఫ్ట్ వేర్ ఫీల్డ్ వైపు వెళ్ళాలి అని కష్టపడుతున్నారు.

చెప్పటం మరిచా ఇప్పుడు పెద్ద అమ్మాయి మా పిల్లలకు హోమ్ ట్యూటర్. ప్రతి రోజు రెండు గంటలు.

ఏదో సినిమాలో అమ్మకంటే పెద్ద యోధురాలు ఎవరు ఉండరు అంటాడు హీరో. మనకు తెలియని ఈ తల్లి లాంటి యోధురాళ్లు ఎందరో.

ఒకసారి ఆమె తో .. ఇంకో రెండు సంవత్సరాలు కష్టం మీకు, తరువాత పిల్లలు చూసుకుంటారు మిమ్మల్ని అని అన్నాను.

ఏం సారూ నన్ను పనిలో నుంచి తీసేయ్యాలి అనుకుంటున్నారా, నా ఒంట్లో శక్తి ఉన్నశీత వరకు నేను నా పని మానను.

ఆమెను అడిగా.. బాధ్యతలు లేని మీ ఆయన మీద కోపం లేదా? అని.

లేదు అన్నది. పిల్లలకు ఉంది. అయినా వీళ్లు తమ చదువులు అయిపోయి, పెళ్లిళ్లు చేసుకొని వెళ్లి పోతే తను నేనే కదండి, కోపాలు, తాపాలు పెట్టుకుంటే అవుతుందా అని సమాధానం.

చిన్న చిన్న వాటికి గొడవలు పడి విడి పోతున్న జంటలకు ఈమె పెద్ద సమాధానం.

మాటల మధ్యలో పెద్ద అమ్మాయి అంది. మా నాన్న తన స్నేహితుల ముందర మా గురుంచి గొప్పగా చెబుతుంటాడు.

**అక్కడే మా నాన్న మొహం ముందరే వారికి చెబుతాం, ఇదంతా మా అమ్మ కష్టం అని.**

ఆమె జీవితం.. పిల్లల అలుకువ అవగాహన ఎన్ని వేదాల సారం!.. అని అనిపిస్తూ ఉంటుంది.

ఎందరో అమ్మల నిజమైన కథ..!!!

**అమ్మేగా కనగలదు అంత గొప్ప అమ్మని. అమ్మేగా ఆది స్వరం. అమ్మేగా ప్రణవనాదం, అమ్మేగా ఓంకారం.**

---

# లోయోలా అకాడమీ విద్యార్థుల ప్లానెట్ ప్రోగ్రాం అల్వాల్ చెరువు పరిసర ప్రాంతాల శుభ్రం

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు.. ప్రతి ఒక్క పౌరుడి కర్తవ్యం అని చాటిచెప్పారు లోయోలా అకాడమీ డిగ్రీ & పీజీ కళాశాల విద్యార్థులు.

కళాశాల సామాజిక సేవా విభాగం 'PLANET' (ప్లానెట్) ఆధ్వర్యంలో ద్వితీయ సంవత్సరం ఎం.ఎస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ) విద్యార్థులు గురువారం (01-10-2026) ఉదయం అల్వాల్ చెరువు పరిసరాల పరిశుభ్రత మరియు అవగాహన కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు.

- **అధికారుల సమన్వయంతో బృహత్తర కార్యక్రమం**

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శ్రీ బోగేశ్వర్ రావు, డిప్యూటీ ఇంజనీర్ శ్రీ సందీప్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (GHMC) ప్రతినిధులు మరియు 'స్వచ్ఛతా హి సేవా' బృందం నాయకుడు శ్రీ ప్రదీప్ రెడ్డిల సమన్వయం, సహకారంతో విద్యార్థులు ఈ శ్రమదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

- **చెత్త సేకరణ.. ప్రజల్లో చైతన్యం**

ఉదయం 8.30 గంటలకే అల్వాల్ చెరువు వద్దకు చేరుకున్న విద్యార్థులు.. చెరువు పరిసరాల్లో




పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, నిరుపయోగంగా పడవేసిన చెత్తను సేకరించి పారవేశారు. కేవలం శుభ్రం చేయడమే కాకుండా, స్థానిక ప్రజలతో మాట్లాడి చెరువుల్లో వ్యర్థాలను పారవేయడం వల్ల జరిగే పర్యావరణ నష్టాన్ని, కాలుష్య ప్రభావాలను వివరించారు.

మన నీటి వనరులను, ప్రజా ప్రదేశాలను శుభ్రంగా ఉంచుకోవడంలో ప్రజల బాధ్యతను గుర్తు చేస్తూ విద్యార్థులు సామాజిక స్పృహను చాటారు.

**కళాశాల యాజమాన్యం అభినందనలు**
**ఈ కార్యక్రమం లోయోలా అకాడమీ**
- **ప్రిన్సిపాల్ డా. ఎన్.బి. బాబు,**
- **వైస్-ప్రిన్సిపాల్ శ్రీ బి. పీటర్,**
- **ఎక్స్టెన్షన్ ఆఫీసర్ శ్రీ స్టీఫెన్ ఆశీర్వాదం, మార్గదర్శకత్వంలో విజయవంతంగా పూర్తయింది.**

ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేసిన ఎక్స్టెన్షన్ ఆఫీసర్




స్టీఫెన్ ఆశీర్వాదం తో పాటు, సమాజ సేవలో భాగస్వాములైన విద్యార్థులందరినీ కళాశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది.
ఈ క్షేత్రస్థాయి అనుభవం విద్యార్థుల్లో పౌర బాధ్యతను, పర్యావరణ స్పృహను మరింత పెంపొందించిందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

# మహాత్మా గాంధీ157వ జయంతి వేడుకలు

**సదాశివపేట కరపత్రం ప్రతినిది**

జాతిపిత మహాత్మా గాంధీ 157వ జయంతి గాంధీ జయంతి పురస్కరించుకుని,ఆహింస, సత్యం మరియు స్వచ్ఛత అనే గాంధేయవాద మార్గదర్శకాలను స్మరించుకుంటూ జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా సాదరంగా ఆహ్వానిస్తున్నాము.

**ఉదయం :10:00 గంటలకు సంగారెడ్డి పాతబస్టాండ్ వద్ద గంజి మైదాన్ గాంధీ**



**విగ్రహం**
**కావున కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజా ప్రతినిధులు**
గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించే ఈ ఘనమైన వేడుకలో మీ అమూల్యమైన భాగస్వామ్యాన్ని కోరుకుంటున్నాము. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిధి గా నిర్మలా జగ్గారెడ్డి నియోజకవర్గ ఇంచార్జ్ ఆంజనేయులు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్ మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్, వైస్ చైర్మన్ షఫీ, సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి,ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు,పట్టణ అధ్యక్షుడు కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొననున్నారు

# 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ మీట్బ్యాడ్మింటన్‌లో సంగారెడ్డి జిల్లాకు బంగారు పతకం.

**- సాధించిన హెడ్ కానిస్టేబుల్ ఈ.డి. సంజీవ్‌ను అభినందించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్**

**సదాశివపేట కరపత్రం ప్రతినిది**

సంగారెడ్డి జిల్లా తెలంగాణ పోలీస్ అకాడమీ, హైదరాబాద్‌లో జరిగిన 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా నిర్వహించిన బ్యాడ్మింటన్ పోటీల్లో సంగారెడ్డి జిల్లాకు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఈ.డి. సంజీవ్ బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ బంగారు పతకం సాధించిన హెడ్ కానిస్టేబుల్ ఈ.డి. సంజీవ్‌ను అభినందించారు. క్రీడల్లో ప్రతిభ కనబరచడం ద్వారా సంగారెడ్డి జిల్లా పోలీస్ శాఖకు గౌరవం తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ప్రతిభను కనబరుస్తూ, జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని సంజీవ్‌ను ప్రోత్సహించారు.

# మార్కండేయ మందిరనిర్మాణానికి విరాళం



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**

మెట్‌పల్లి పట్టణానికి చెందిన వడ్లకొండ వెంకట్రావు, తన తండ్రి గంగారం పేరుతో శ్రీ శివ భక్త మార్కండేయ మందిర పునర్నిర్మాణానికి రూ. 25,116 విరాళం అందించి శాశ్వత సభ్యత్వం గురువారం పొందారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం అధ్యక్షులు ద్యావనపల్లి రాజారాం, వడ్లకొండ వెంకట్రావు కుటుంబానికి మార్కండేయ శక్తి గణపతి అనుగ్రహం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శి, ప్రచార కార్యదర్శి, సభ్యులు పాల్గొన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
శుక్రవారం అక్టోబర్ 02, 2026

# సిద్దాపూర్ చెరువులో యథేచ్ఛగా అక్రమ మట్టి తవ్వకాలు:

## కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్ము దోపిడీపై కాలనీవాసుల తీవ్ర ఆగ్రహం

- వినాయక నిమజ్జనం, రోడ్డు నిర్మాణాల నెపంతో సాగుతున్న అక్రమ దందా
- జిల్లా కలెక్టర్ స్పందించి సమగ్ర విచారణ జరపాలని స్థానికుల డిమాండ్







**సదాశివపేట కరపత్రం ప్రతినిధి,**
సదాశివపేట మున్సిపాలిటీ పరిధిలోని సిద్దాపూర్ గ్రామం (7వ వార్డు) లో గల స్థానిక చెరువు ప్రస్తుతం అక్రమ మట్టి, మొరం తవ్వకాలకు ప్రధాన అడ్డాగా మారింది. నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కి, పగలు రేయి తేడా లేకుండా యథేచ్ఛగా సాగుతున్న ఈ కోట్ల రూపాయల భూగర్భ వనరుల దోపిడీపై స్థానిక కాలనీవాసులు మరియు ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దేవుడి పేరుతో మట్టి వ్యాపారం:
గణేష్ నిమజ్జనం ఏర్పాట్ల కోసమని, అలాగే సదాశివపేట నుండి సిద్దాపూర్‌కు నూతనంగా మంజూరైన రోడ్డు నిర్మాణ పనుల కోసమని నమ్మిస్తూ కొందరు ప్రైవేట్ వ్యక్తులు, రాజకీయ నాయకులు కలిసి ఈ అక్రమ దందాకు తెరలేపారు. వినాయక నిమజ్జనానికి దారి మరమ్మతులు చేస్తున్నామనే సాకుతో, 7వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్ భర్త స్వయంగా ముఠాగా ఏర్పడి పెద్ద ఎత్తున చెరువు నుండి మట్టిని ప్రైవేట్ పనులకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని స్థానికులు ప్రత్యక్షంగా ఆరోపిస్తున్నారు. దేవుడి పేరు చెప్పి ప్రభుత్వ సంపదను ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకుంటూ కోట్ల రూపాయల వ్యాపారం సాగిస్తున్నారని కాలనీవాసులు మండిపడుతున్నారు.

ప్రశ్నార్థకంగా మారిన చెరువు ఉనికి:
భారీ జేసీబీ యంత్రాలు, టిప్పర్లను ఉపయోగించి చెరువు గర్భాన్ని ఇష్టారాజ్యంగా తవ్వేస్తుండటంతో చెరువు ఉనికి పూర్తిగా ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వ అనుమతులు లేకుండా, కనీస నిబంధనలు పాటించకుండా రాత్రికి రాత్రే వందలాది ట్రిప్పుల మట్టి, మొరం మాయమవుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానిక నేతల ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కలెక్టర్ సమగ్ర విచారణ జరపాలి:
సదాశివపేట పరిసర ప్రాంతాల్లో పర్యావరణాన్ని దెబ్బతీస్తూ, ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్న ఈ అక్రమ తవ్వకాలపై జిల్లా కలెక్టర్ గారు తక్షణమే స్పందించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులతో సమగ్ర విచారణ జరిపించి, ఈ అక్రమ దందా వెనుక ఉన్న ఎంతటి వారినైనా సరే వదలకుండా చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే చెరువును సంరక్షించాలని స్థానిక ప్రజలు మరియు స్వచ్ఛంద సంస్థలు గట్టిగా కోరుతున్నాయి.

# భారత జనతా పార్టీలో చేరిన ఎల్లారెడ్డిపల్లి తాండ నాయకులు

**కామారెడ్డి జిల్లా కరపత్రం ప్రతినిది అక్టోబర్ 01**





ఎల్లారెడ్డి.భారత జనతా పార్టీలో చేరిన ఎల్లారెడ్డిపల్లి తండా,కట్టకింది తండా వాసులు భారతీయ జనతా పార్టీలో చేరారు. వార్డ్ మెంబర్ ధరవత్ మీరి, ధరవత్ లలిత, భాస్కర్ తదితరులు జాయిన్ అయ్యారు
ఈ చేరికల కార్యక్రమం డా. పైడి ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో ఉత్సాహభరితంగా జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. పైడి ఎల్లారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు నీలం చిన్నా రాజులు, రవీంద్ర రావు, సంపత్ రెడ్డి పాల్గొని నూతనంగా పార్టీలో చేరిన వారికి స్వాగతం పలికారు.తండాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం మరియు పార్టీ బలోపేతం కోసం కలిసి పనిచేస్తామని ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు పేర్కొన్నారు.

# సంగారెడ్డిలో 'గ్రామ పాలనాధికారుల కృతజ్ఞత సభ'

## -- ముఖ్య అతిథిగా హాజరుకావాలని జగ్గారెడ్డికి ఆహ్వానం



**సదాశివపేట కరపత్రం ప్రతినిధి,**
సంగారెడ్డి గ్రామ పాలనాధికారులుగా జిపిఒస్ నియామకమై విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా, శుక్రవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన కృతజ్ఞత సభ'కు ముఖ్య అతిథిగా హాజరుకావాల్సిందిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే టి. జగ్గారెడ్డిని జిపివోల సంఘం నాయకులు ఆహ్వానించారు. గురువారం సంగారెడ్డిలోని ఐబీ గెస్ట్ హౌస్‌లో జగ్గారెడ్డిని సంఘం ప్రతినిధులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.

జిపివోల సంఘం నాయకులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో వీఆర్వో వి ఆర్ ఒ వ్యవస్థను పూర్తిగా చిన్నాభిన్నం చేసి, ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే తమకు న్యాయం జరిగిందని, తిరిగి తమ సొంత శాఖల్లోకి గ్రామ పాలనాధికారులుగా రాగలిగామని సంతోషం వ్యక్తం చేశారు. విధుల్లో చేరి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతగా సభను ఏర్పాటు చేస్తున్నట్లు వారు వివరించారు.
గ్రామ పాలనాధికారుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన జగ్గారెడ్డి, సంఘం నాయకులకు, ఉద్యోగులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

జిపివోల సంఘం సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, సహాయ కార్యదర్శి సుజాత, నాయకులు బొంగుల రవి, కూన సంతోష్ లతో పాటు సంగారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ హాఫీజ్, టౌన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గొల్లగూడెం గ్రామానికి చెందిన స్వప్నకు సీఎం సహాయ నిధి చెక్కు అందజేసినగోదావరి అంజిరెడ్డి



**సదాశివపేట కరపత్రం ప్రతినిది**
సదాశివపేట అనారోగ్యంతో బాధపడుతున్న గొల్లగూడెం గ్రామానికి చెందిన మారేపల్లి స్వప్న గారికి ఎమ్మెల్సీ అంజిరెడ్డి గారి సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును బిజెపి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అందజేశారు.
ఈ సందర్భంగా గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ... ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఎల్లప్పుడూ వారికి తోడుగా, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నిరుపేదలకు వైద్య సహాయం అందించడంలో ప్రభుత్వం నుండి వచ్చే ఇలాంటి సహాయాలు ఎంతో ఊరటనిస్తాయని, భవిష్యత్తులోనూ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఆమె తెలియజేశారు.
కార్యక్రమంలో బిజెపి సదాశివపేట మండల పార్టీ అధ్యక్షుడు కర్ణం ఆదిత్య, మండల ప్రధాన కార్యదర్శి ఉక్కిస భరత్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు నాగరాజు, సీనియర్ నాయకులు జగన్నాథ్ రెడ్డి, సుభాష్, సాకేత్ మరియు పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సదాశివపేట మండలం కంబాలపల్లి గ్రామానికి చంధిన వివిధ పార్టీల వారు తెలంగాణ రక్షణ సేనలో చేరిక



**సదాశివపేట కరపత్రం ప్రతినిది,**
సదాశివపెట మండలం కంబాలపల్లి గ్రామం నుండి కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ రక్షణ సేనలో చేరిక సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం కంబాలపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ రక్షణ సేన టి అర్ స్ పార్టీలో సంగారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి కలబ్గూర్ దయాకర్ రెడ్డి ఆధ్వర్యంలో.హైదరాబాద్‌లోని టీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత్రి శ్రీమతి కల్వకుంట్ల కవిత పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించడం జరిగింది.

**టీఅర్ స్ పార్టీలో చేరికలు**

గోపాల్ -- బీఆర్ఎస్ మాజీ వార్డు సభ్యుడు
సురేష్ బాబు -- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు
కమాల్ -- బీఆర్ఎస్ మాజీ ఉపాధ్యక్షుడు
రాజు -- కాంగ్రెస్ అధ్యక్షుడు
మహేష్ బాబు -- కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త
శ్రీనివాస్ -- కాంగ్రెస్ నాయకుడు

తదితరులుసందర్భంగా కలబ్గూర్ దయాకర్ రెడ్డి మాట్లాడుతూ, పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు స్వాగతం పలుకుతూ, వారి భాగస్వామ్యంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు గోపాల్ రెడ్డి, అరుణ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు

# కుస్తీ పోటీల్లో ఖేడ్ మైనారిటీ గురుకుల విద్యార్థుల సత్తా.. ఆరు పతకాలు కైవసం

**– ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి పోటీల్లో అద్భుత ప్రతిభ.. ఒక విద్యార్థికి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక**




**నారాయణఖేడ్ అక్టోబర్ 1 కరపత్రం ప్రతినిది, :**
ఉమ్మడి మెదక్ జిల్లా: సంగారెడ్డిలోని అంబేద్కర్ మైదానంలో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య కుస్తీ పోటీల్లో నారాయణఖేడ్ పట్టణంలోని మైనారిటీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు.
హోరాహోరీగా సాగిన పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి మొత్తం ఆరు పతకాలు సాధించారు. ముస్తైప్ బంగారు పతకం సాధించగా, అయాన్, రిజ్వాన్, రెహన్, ఉమర్, అద్నాన్ స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నారు. వీరిలో ఒక విద్యార్థి రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వర్గాలు తెలిపాయి.
జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. రాములు, పాఠశాల సమన్వయకర్త జాకీర్, సంజీవ నాయక్, వ్యాయామ ఉపాధ్యాయులు సంతోష్, అజీజ్‌తో పాటు పాఠశాల సిబ్బంది అభినందించారు.
రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి మరింతగా సాధన చేసి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల విజయంతో పాఠశాలలో ఆనందం నెలకొంది.

# సదాశివపేటమున్సిపల్ కమిషనర్ శివాజీ కి గాంధీ చౌక్ వద్ద ఇబ్బంది గురించితెలపడం



**సదాశివపేట. కరపత్రం ప్రతినిది,**
సదాశివపేటగాంధీ చౌక్ వద్ద రోడ్డు గుంతలలో వేసిన డస్ట్ వల్ల దుమ్ము లేస్తూ, స్థానిక వ్యాపారులకు మరియు ప్రజలకు ఇబ్బంది కలుగుతున్నందున ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టవలసిందిగా వినతి.
మున్సిపల్ కమిషనర్ శివజి కి తెలపడం ఏమనగా మేము గాంధీ చౌక్ ప్రాంతంలోని స్థానిక వ్యాపారస్తులం నివాసితులం.ఇటీవల వినాయక నిమజ్జనం మరియు వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా, గాంధీ చౌక్ వద్ద ఉన్న ప్రధాన రోడ్డు గుంతలను పూడ్చడానికి మున్సిపల్ సిబ్బందితో డస్ట్ (పొడి మట్టి) పోయించినందుకు స్థానిక ప్రజల తరపున మీకు ప్రత్యేక కృతజ్ఞతలు. అయితే, ప్రస్తుతం ఆ డస్ట్ వల్ల గాంధీ చౌక్ వద్ద తీవ్రమైన సమస్య తలెత్తింది. ఆ మార్గంలో కార్లు, మోటార్ సైకిళ్లు, ఇతర భారీ వాహనాలు వేగంగా వెళ్లేటప్పుడు రోడ్డుపై ఉన్న డస్ట్ మొత్తం గాల్లోకి లేచి, భారీగా దుమ్ము వస్తోంది. ఆ దుమ్ము చుట్టుపక్కల ఉన్న దుకాణాలలోకి, వ్యాపార సముదాయాలలోకి విపరీతంగా చేరుతోంది. దీనివల్ల వ్యాపారాలు చేసుకోవడం కష్టంగా మారడమే కాకుండా, అక్కడ నిలబడే ప్రజలు, వాహనదారులు శ్వాసకోస ఇబ్బందులకు గురవుతున్నారు.సాధారణంగా రోడ్డు గుంతలను తాత్కాలికంగా పూడ్చడానికి మొరము లేదా చిప్స్ (చిన్న రాళ్లు) ఉపయోగిస్తారు. కానీ ఇక్కడ కేవలం డస్ట్ వేయడం వల్ల ఈ దుమ్ము సమస్య మరింత తీవ్ర రూపం దాల్చింది.కావున, దయచేసి మా పరిస్థితిని గమనించి, వీలైనంత త్వరగా ఆ డస్ట్‌ను అక్కడి నుండి తొలగించి, దానికి ప్రత్యామ్నాయంగా మొరము లేదా బిటి ప్యాచ్ వర్క్ (చిప్స్) వేయించి ఈ దుమ్ము సమస్య నుండి మాకు ఉపశమనం కలిగించాల్సిందిగా కోరుతున్నగాంధీ చౌక్ స్థానిక వ్యాపారస్తులు నివాసితులు,సదాశివపేట.

# ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా జర్నలిస్టులు.. డీసీసీ అధ్యక్షుడు: చంద్రశేఖర్‌రెడ్డి

**– ఖేడ్‌లో నూతన కార్యవర్గానికి ఘన సన్మానం.. సమాజం పట్ల బాధ్యతతో పనిచేయాలని సూచన**



**నారాయణఖేడ్ అక్టోబర్ 1 కరపత్రం ప్రతినిది**
ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ సమాజానికి అవసరమైన సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారని సంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు.
గురువారం నారాయణఖేడ్‌లో నూతనంగా ఎన్నికైన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య కార్యవర్గాన్ని ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు.
చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిజం బాధ్యతాయుతమైన వృత్తి అని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయడంలో జర్నలిస్టుల పాత్ర ముఖ్యమన్నారు. సమాజం పట్ల బాధ్యతతో పనిచేస్తున్న జర్నలిస్టులను గుర్తించి గౌరవించాల్సిన అవసరం ఉందని తెలిపారు.
నూతన కార్యవర్గ సభ్యులు ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సమాజహితం కోసం మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు.

# సంగారెడ్డిజిల్లా బీజేపీ పార్టీ కార్యాలయానికి తమిళనాడు రాష్ట్ర ఇంచార్జ్ కాసం వెంకటేశ్వరరావు వస్తున్నారు



**సదశివపెట కరపత్రం ప్రతినిది**
సంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో కీలక సన్నాహక సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్. రామచందర్ రావు పిలుపు మేరకు, సంగారెడ్డి జిల్లా రథసారథి గోదావరి అంజిరెడ్డి సూచనల ప్రకారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న "సేవా సంకల్ప్ అభియాన్" లో భాగంగా "సేవా జ్యోతి" కార్యక్రమ నిర్వహణపై ఈ సమావేశంలో చర్చించనున్నారు.
ఈ సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, తమిళనాడు రాష్ట్ర సహ ఇన్-చార్జ్ అయిన శ్రీ కాసం వెంకటేశ్వర్ రావు హాజరుకానున్నారు.

**సమయం: ఉదయం 9:00 గంటలకు**
**బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయం,**
సమావేశానికి సంగారెడ్డి జిల్లాలోని రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు, మండల అధ్యక్షులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, సెల్ కన్వీనర్లు, మరియు జిల్లా పదాధికారులు అందరూ ససమయానికి హాజరై, చర్చల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా జిల్లా నాయకత్వం కోరింది.